సాక్షి ప్రకాశం

ఆదివారం : 16 : జూలై : 2023



విద్యుత్ షాక్‌తో ఎనర్జీ అసిస్టెంట్ మృతి

విద్యుత్ లైన్ పనులు చేస్తూ షాక్‌కు గురై ఎనర్జీ అసిస్టెంట్ మృతిచెందిన ఘటన పొదిలి నగర పంచాయతీ పరిధి కంభాలపాడులో చోటు చేసుకుంది.

- 8లో..



అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36/29

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రపతిని కలవనున్న రెడ్‌క్రాస్ చైర్మన్

ఒంగోలు అర్బన్: రాష్ట్రపతి భవన్‌లో రెడ్‌క్రాస్ సేవలపై జరిగే సమీక్షకు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ప్రకాష్ ఈ నెల 17వ తేదీ భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్మును కలవనున్నారు. రెడ్‌క్రాస్ సేవలపై సమీక్షకు రాష్ట్రం నుంచి 10 మంది సభ్యుల బృందం ఢిల్లీ వెళ్తున్నట్లు ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ బృందంలో తాను కూడా వెళ్లి జిల్లాలో అందించే సేవలను వివరించనున్నట్లు చెప్పారు. ఎన్‌టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరం, రాష్ట్ర చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి ఫరీదా, ట్రెజరర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డిలతో పాటు మరో ఆరుగురు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీలు ప్రగతి కనపరచాలి

- జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి

ఒంగోలు అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023లో భాగంగా గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో ప్రగతి కనబరిచేలా కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) జీవీ నారాయణరెడ్డి మండల స్థాయి అధికారులకు సూచించారు. శనివారం డివిజనల్, మండల పంచాయతీ అధికారులు, విస్తరణాధికారులు, పంచాయతీ సెక్రటరీలతో డీపీవో కార్యాలయం నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో మాట్లాడుతూ వచ్చే వారంలో కేంద్ర బృందాలు మౌలిక వసతుల ఏర్పాటు, పారిశుధ్యంలో పంచాయతీల పనితీరు తదితర అంశాలపై తనిఖీలకు వస్తారన్నారు. గ్రామ, మండల స్థాయిలో కేటాయించిన పనులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. దీనిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ, ఒంగోలు, కనిగిరి, మార్కాపురం డివిజన్ల పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



ఉత్తుత్తి హామీలు, అబద్ధాలు, నయవంచన ఈ పదాలు వింటే ఠక్కున గుర్తుకు వస్తుంది చంద్రబాబు పాలన. ఆయన ఐదేళ్ల పాలనలో జిల్లాలో దుర్భిక్షం రాజ్యమేలింది. సాగు..తాగునీటికి కటకటలాడిన దుస్థితి.. పశ్చిమాన అయితే ఊళ్లకు ఊళ్లే వలసలు వెళ్లి పోయాయి. రుణమాఫీ హామీని గాలికొదిలేసి లక్షలాది మంది కర్షకులను, డ్వాక్రా మహిళలను దగా చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు గాలికి వదిలేశారు. ఈ ప్రాజెక్ట్ పేరుతో విడుదలైన అరకొర నిధులు బాబు బినామీలు కాజేశారు. రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని త్రిశంకు స్వర్గంలోకి పెట్టారు. ఐదేళ్లుకాలక్షేపం చేసి ఎన్నికల వేళ హడావుడిగా శిలాఫలకం వేసి వంచన చేశారు. ఇలా అన్ని రంగాల్లో జిల్లాను నట్టేట ముంచేశారు చంద్రబాబు..నేడు ఆయన తనయుడు నారా లోకేష్ యువగళం పేరుతో జిల్లాలో పర్యటించనున్నారు.

బాబు జమానా.. అంతా మాయ..!

- ఉమ్మడి ప్రకాశం జిల్లాను పూర్తిగా విస్మరించిన చంద్రబాబు
- రామాయపట్నం పోర్టు పేరుతో ఐదేళ్లు డ్రామా
- ఇక వెలిగొండ పనులు బినామీ సీఎం రమేష్‌కి అప్పగింత
- కనిగిరిలో నిమ్జ్‌ను గాలికి వదిలేసిన చంద్రబాబు
- లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలోకి..

సాక్షిప్రతినిధి, ఒంగోలు: తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐదేళ్ల పాలనలో జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ, 5 అసెంబ్లీల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ తరుపున గెలిచిన ఆరుగురు ఎమ్మెల్యేల్లో నలుగురిని చంద్రబాబు సంతలో పశువుల్లా కొనుగోలు చేసి తన పార్టీలోకి తన్నుకుపోయారు. ఇలా రాజకీయంగా వంచనకు తెరతీసిన చంద్రబాబు జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారు. ఒక్క ప్రాజెక్టును కూడా జిల్లాకు తీసుకురాలేదు సరికదా ఉన్న వాటికీ అత్తెసరుగా నిధులు కేటాయించి నిర్లక్ష్యం చేశారు. జిల్లాను పూర్తిగా విస్మరించాడనటంలో సందేహమే లేదు.

ఐదేళ్లూ కరువే...

చంద్రబాబు 2014లో అధికారం చేపట్టిన నాటి నుంచి ఐదేళ్లూ కరువే. వర్షాలు లేకపోవటంతో పాటు సాగర్ జలాలను కూడా సక్రమంగా జిల్లాకు అందించకపోవటంతో రైతులు పంటలు పండక, కనీసం తాగునీటికి కూడా కటకటలాడిన పరిస్థితి. ఏటా 80 శాతానికి పైగా కరువు మండలాలే. గతంలో ఎన్నడూ లేనంతగా కరువుతో అల్లాడిపోయారు. పంటలు లేక తిండి గింజలు కరువై వలసలు వెళ్లాల్సిన దుర్భిక్ష పరిస్థితులను జిల్లా వాసులు చవిచూశారు.

పాలేరూ అంతే..

కొండపి నియోజకవర్గంలోని సంగమేశ్వరం వద్ద పాలేరుపై నిర్మించతలపెట్టిన సంగమేశ్వరం ప్రాజెక్టు పనులు టీడీపీ హయాంలో ముందుకు సాగనేలేదు. అప్పటి, నేటి ఎమ్మెల్యే డోల బాలవీరాంజనేయ స్వామి (టీడీపీ) కాంట్రాక్టర్లను మార్చటమే పనిగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా పది గ్రామాలకు తాగు నీరు, 15 గ్రామాలకు సాగునీరందించే ఈ కీలక ప్రాజెక్టు ఎమ్మెల్యే తీరుతో తీవ్ర నష్టం వాటిల్లింది.

సుబాబుల్ ప్రైవేటు పరం..

జిల్లాలో సామాజిక వనాలు అయిన సుబాబుల్, జామాయిల్ అధికంగా సాగు చేస్తారు. వాటికి గిట్టుబాటు ధర ఇవ్వమని కోరినా నిరాకరించి ప్రైవేటు పేపరు మిల్లులు రైతులను దోచుకునేట్లు చేశాడు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు వెళ్లి జిల్లాకు న్యాయం చేయమని కోరితే ప్రకాశం జిల్లా నాకేమి చేసింది... కేవలం ఐదుగురు ఎమ్మెల్యేలను మాత్రమే ఇచ్చింది కాబట్టి జిల్లాకు ఏమీ చేయను అని తెగేసి చెప్పిన నైజం చంద్రబాబుది.

ఒంగోలు డెయిరీ మూత...

పాడి రైతులకు ఆదాయ వనరుగా ఉన్న ఒంగోలు డెయిరీని చంద్రబాబు తన హెరిటేజ్ కోసం నిలువునా ముంచేశారు. తన పార్టీకి చెందిన డెయిరీ పాలక మండలి చేత సహకార రంగంలో ఉన్న డెయిరీని కంపెనీ చట్టంలోకి మార్పించి దగా చేశారు. డెయిరీ సొమ్మంతా దోచుకునేటట్లు చేసి చివరకు రూ.100 కోట్ల వరకు అప్పులు చేయించి మరీ డెయిరీని మూతవేయించారు. పాడి రైతులను నట్టేట ముంచారు. వేలాది ఉద్యోగులు, కార్మికులు ఉపాధిలేక రోడ్డున పడ్డారు.



ఒంగోలుకు అన్యాయం..

గుండ్లకమ్మ నుంచి ఒంగోలు నగరానికి తాగునీరందించేందుకు కేంద్ర నిధులు రూ.125 కోట్లు ఇచ్చింది. అయితే పనుల్లో జాప్యం కారణంగా సుమారు రూ.70 కోట్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. నీళ్ల వెతలు తీరలేదు సరికదా ఆ భారం ఒంగోలు నగరపాలక సంస్థపై పడింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తీసుకెళ్లారు. ప్రత్యేక నిధులు తెచ్చారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

రుణమాఫీ పేరిట దగా..

2014 ఎన్నికల ముందు రైతులు, డ్వాక్రా మహిళలు ఎవరూ ఒక్క రూపాయి కూడా బ్యాంకులకు రుణాలు చెల్లించవద్దు. అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తానంటూ చంద్రబాబే హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మాట మార్చారు. కమిటీల పేరుతో ఏడాదిన్నరపాటు కాలయాపన చేశారు. పాత ప్రకాశం జిల్లాలో 4.50 లక్షల మంది రైతులు, 7 లక్షల మంది డ్వాక్రా మహిళలు కలిపి సుమారు రూ.11 వేల కోట్లకు పైగా రుణాలు ఉండేవి. కేవలం రూ.3 వేల కోట్లలోపు మాత్రమే రుణాలు మాఫీ చేసి అటు రైతులను, డ్వాక్రా మహిళలను దగా చేశారు.

అంతా తూచ్..

జిల్లా ప్రజల చిరకాల కోరిక రామాయపట్నం పోర్టు. టీడీపీ ప్రభుత్వం గ్రాఫిక్స్‌తో కాలయాపన చేసింది. చివరకు ఎన్నికలకు ముందు డ్రామాకు తెరతీశారు. మేజరు పోర్టును మినీపోర్టుగా మార్చేశారు. హడావుడిగా శిలాఫలకం వేశారు. నన్ను తిరిగి గెలిపిస్తే రామాయపట్నం పోర్టు, పేపర్ మిల్లు ఏర్పాటు చేస్తానని బాబు ఉత్తుత్తి హామీ ఇచ్చి వెళ్లారు. అలాగే కనిగిరి నియోజకవర్గంలో నిమ్జ్ సంస్థను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దానికి భూములు కేటాయించటంలో కూడా మీనమేషాలు లెక్కించి ఆ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయాడు. ఇక దొనకొండ ఇండస్ట్రియల్ కారిడార్‌ను కూడా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లా సమగ్రంగా అభివృద్ధి బాట పట్టింది. అన్నిరకాలుగా జిల్లాను సీఎం వైఎస్ జగన్ ముందుకు తీసుకుపోతున్నారు. చంద్రబాబు తనయుడు లోకేష్ యువగళం పేరుతో జిల్లాలో ఆదివారం నుంచి పాదయాత్ర చేపడుతున్నారు. తన తండ్రి జిల్లాకు ఏం చేశాడని తన పాదయాత్రలో చెబుతాడో వేచి చూడాల్సిందే.

వెలిగొండకు తీవ్ర అన్యాయం...



వెలిగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు తీవ్ర అన్యాయం చేశాడు. మహానేత డాక్టర్ వైఎస్ఆర్ వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి పనులు ముమ్మరంగా చేపట్టారు. ఆయన అకాల మృతి తరువాత రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ సీఎంలు అరకొరగా పనులు చేపట్టారు. అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కాంట్రాక్టర్లను మార్చి తన బినామీ అయిన సీఎం రమేష్‌కు టన్నెల్ నిర్మాణ పనులు నామినేషన్ మీద అప్పగించాడు. అంతే పర్సెంటేజీలు తీసుకోవటం మినహా పనులు మాత్రం ముందుకు సాగలేదు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఒకటో టన్నెల్ 13.600 కిలో మీటర్ల మేర తవ్వారు. ఇక బాబు హయాంలో ఒకటో టన్నెల్‌ను కేవలం 2 కిలో మీటర్లు మాత్రమే తవ్వి మమ అనిపించారు. అంటే రోజుకు సరాసరిన 1.31 మీటర్లు మాత్రమే తవ్వారనమాట. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేశారు. దీంతో ఒకటో టన్నెల్‌ను అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 3.187 కిలోమీటర్లు తవ్వి పూర్తి చేశారు. రోజుకు సరాసరిన 4.30 మీటర్లు తవ్వి ఒకటో టన్నెల్‌ను పూర్తి చేశారు. రివర్స్ టెండర్ ద్వారా దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ సంస్థ మిగిలి ఉన్న రెండో టన్నెల్ నిర్మాణ పనులను ముమ్మరంగా చేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సేవకురాలికే పాలనా పగ్గాలు



వలంటీర్‌గా పథకాలను వివరిస్తున్న నాగలక్ష్మి (ఫైల్)

పామూరు: రూ.కోట్లు ఖర్చుచేసినా దక్కని పదవి సేవకే దక్కింది. వలంటీర్ సేవలను మెచ్చిన ప్రజలు శెభాష్ అంటూ ఏకంగా గత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన తాళ్ల నాగలక్ష్మి ఇంటర్మీడియెట్ వరకు చదువుకుని అదే గ్రామ పంచాయతీ పరిధిలోని తూమాటివారిపాలెం గ్రామ వలంటీర్‌గా పనిచేస్తోంది. పంచాయతీలో జనాభా 1200 దాకా ఉండగా ఓటర్లు 862 మంది ఉన్నారు. వలంటీర్‌గా విధులు ప్రారంభించిన నాటి నుంచి తాను పనిచేసే గ్రామంతోపాటు తన స్వగ్రామమైన అయ్యవారిపల్లెలో కూడా ప్రజలకు తనతోటి వలంటీర్లతో కలిసి సేవాభావంతో సేవలందించేది నాగలక్ష్మి. అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు మంజూరు చేయించడం, వితంతువులు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయించడం, రైతులకు పంట నష్టం రాయించడం, విత్తనాలు, ఎరువులు ఇప్పించడం వంటి సేవలతో పంచాయతీ ప్రజలకు మరింత చేరువైంది. అదేవిధంగా కరోనా సమయంలో ప్రజలను అప్రమత్తంచేసి వారిని కరోనా బారిన పడకుండా తగు జాగ్రత్తలు సూచించింది. దీంతో నాగలక్ష్మి సేవాతత్వాన్ని గమనించిన పంచాయతీ ప్రజలు ఒక్కతాటిపై నిలిచి ఆమెకే సర్పంచ్ పదవిని కట్టబెట్టారు.

నమ్మకాన్ని నిలబెడుతోంది



నాగలక్ష్మి వలంటీర్‌గా పనిచేస్తున్నప్పుడు సేవాభావంతో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తూ అందరి మన్ననలను పొందేది. కరోనా సమయంలో ధైర్యంగా కరోనాపై ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందజేసింది. ఆమె సేవకు మెచ్చి సర్పంచ్‌ను చేశాం. ప్రస్తుతం పంచాయతీ అభివృద్ధికి పనులు చేస్తూ మా నమ్మకాన్ని నిలబెడుతోంది.

– విజయ, గృహిణి, తూమాటివారిపాలెం

రైతన్నలను లక్షాధికారులుగా మార్చిన సీఎం

- చుక్కల భూములు, అసైన్డ్ భూములపై రైతులకు పూర్తి హక్కు
- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



త్రిపురాంతకం మండలం లేళ్లపల్లిలో రైతులకు భూమి హక్కు పత్రాలు అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: రైతాంగానికి చుక్కల భూములు, అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పించి పేద, దళిత, బలహీన వర్గాలకు చెందిన రైతాంగాన్ని లక్షాధికారులుగా మార్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం లేళ్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా భూములు అనుభవంలో ఉన్న వాటిపై హక్కులు లేక రైతాంగం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారన్నారు. రైతుల ఆశలు నెరవేర్చే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల భూములు, అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పించారని అన్నారు. రాష్ట్రంలో మంచి పాలన అందిస్తున్నందున మనమంతా మద్దతుగా నిలిచి రానున్న ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేయాలన్నారు. గ్రామసచివాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. చుక్కల భూముల రైతులు 486 మందికి 840 ఎకరాల హక్కు పత్రాలను అందజేశారు. వాటర్ షెడ్ ద్వారా రైతులకు రూ.70 లక్షల సబ్సిడీతో థైవాన్ స్ప్రేయర్లు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈఓలు కే తులసి మల్లికార్జుననాయక్, టీ రాజశేఖరరెడ్డి, ఏఓ కే నీరజ, ఏపీవో సుజాత, ఏపీఎం ఎడ్వర్డ్, ఈఓఆర్‌డీ మురళీమోహన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు వెంకటేశ్వర్లు, హనుమాన్‌బాబు, సురేష్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, గ్రామసర్పంచ్ మంగమ్మ, ఎంపీటీసీ వెంకటమ్మ, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నక్కా చిన్నత్రిపురరెడ్డి, మల్లికార్జున్, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా పాకల బీచ్ అభివృద్ధి

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



పాకలబీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సింగరాయకొండ: పాకల బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా శనివారం ఆయన బీచ్‌ను సందర్శించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం బీచ్‌లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దటానికి అవసరమైన కల్పనకు ప్రత్యేక బృందాలను నియమించి సర్వే చేయిస్తోందన్నారు. బీచ్‌ల అభివృద్ధికి సుమారు రూ.10 కోట్ల నిధులు కేటాయిస్తుందని ఆ నిధులతో రిసార్ట్‌లు, హోటళ్లు, స్నానాల గదులు వంటివి ఏర్పాటు చేస్తారని చెప్పారు. బీచ్‌లో అసంపూర్తిగా ఆగిపోయిన నిర్మాణాన్ని చూసి ఎందుకు ఆపారని తహశీల్దార్ ఉషను కలెక్టర్ అడగ్గా రెస్టారెంట్ కట్టడానికి నిధులు మంజూరయ్యాయని, కానీ వారు వారికి కేటాయించిన స్థలంలో కాకుండా వేరే చోట నిర్మించడంతో పనులు ఆపేశారని తెలిపారు. మత్స్యకారులకు బీచ్‌లో అన్ని రకాల వసతులు కల్పించి బీచ్‌ను అభివృద్ధి చేస్తామని దాని నిర్వహణ కూడా మత్స్యకారులకే ఇస్తామని చెప్పారు. గ్రామంలో సచివాలయం-1, 2 లను ఆయన తనిఖీ చేశారు. తరువాత జగనన్న లేఅవుట్ లో నూతనంగా మరికొంత స్థలం కేటాయించారని ఆ స్థలానికి విద్యుత్, రోడ్లు లేవని గ్రామానికి చెందిన దామతోటి శ్రీనివాసులు తెలపటంతో ఆ లేఅవుట్‌ను పరిశీలించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

సోనాబోట్ల సమాచారం ఇవ్వండి:

తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన సోనాబోట్ల వలన మత్స్యసంపద లభించటం లేదని లక్షలాది రూపాయల వలలు కూడా ధ్వంసం అవుతున్నాయని కలెక్టర్ దృష్టికి మత్స్యకారులు తీసుకొచ్చారు. అడ్డుకున్న వారిపై దాడిచేసి గాయపరుస్తున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కడలూరు లో తన స్నేహితుడే కలెక్టరుగా విధులు నిర్వహిస్తున్నాడని ఈసారి సోనాబోట్లు వస్తే ఆబోటు లైసెన్స్ నంబరు తెలియజేస్తే ఆ నంబరును తన స్నేహితునికి పంపిస్తే ఆ బోట్లకు జరిమానా విధిస్తాడన్నారు. ఆయన వెంట ఎంపీడీవో షేక్ జమీఉల్లా, తహశీల్దార్ సీహెచ్ ఉష, సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, ఎంపీటీసీ గోళ్లమూడి అశోక్‌రెడ్డి, జీ గోవర్దన్, పాలెపు మాధవరావు పాల్గొన్నారు.

పీరాపురంలో పారని టీడీపీ పాచిక..!

- నిన్నేమో టీడీపీ వర్గీయుల స్థలం అన్నారు
- నేడేమో అది పోలేరమ్మ దేవస్థాన స్థలం.. కాపాడాలన్నారు
- చివరికి ఆ స్థలంలో పంచాయతీ స్థలం అని బోర్డు పెట్టారు

సింగరాయకొండ: నిన్నేమో 'నా స్థలాన్ని గ్రామ వలంటీర్ ఆక్రమించేందుకు ప్రయత్నించాడని ఇదేమని ప్రశ్నిస్తే దాడి చేసి గాయపరిచారని' టీడీపీ వర్గీయులు ఆరోపణ చేశారు. ఇప్పుడేమో ఆ స్థలం పోలేరమ్మ దేవస్థానానికి చెందిన స్థలమని ఆ స్థలాన్ని కాపాడాలని మండల కేంద్రంలో అదే టీడీపీ మద్దతుదారులు ర్యాలీ చేసి తహశీల్దార్, ఎంపీడీవో, పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగారు. ఏదో జరిగిపోతుందని హడావుడి చేసే ప్రయత్నం చేశారు జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు. దీంతో వాస్తవాన్ని తెలుసుకున్న అధికారులు టీడీపీ ఓవరాక్షన్‌కు ముగింపు పలికేందుకు పీరాపురం వెళ్లారు. వాస్తవాన్ని పరిశీలించి టీడీపీ వర్గీయులు వివాదం చేసిన స్థలంలో ఉన్న ముళ్లకంపలను తొలగించి ఈ స్థలం గ్రామ కంఠందని, ఇది పంచాయతీకి చెందుతుందని..ఆ స్థలంలో బోర్డు పెట్టాలని సీఐ రంగనాథ్ చెప్పటంతో పంచాయతీ కార్యదర్శి అశోక్ ఆ స్థలంలో బోర్డు పెట్టారు. తరువాత సీఐ రంగనాథ్ మాట్లాడుతూ ఈ స్థలానికి సంబంధించి ఎవరి వద్ద అయిన హక్కు పత్రాలు ఉంటే తీసుకుని వస్తే వాటిని పరిశీలించి ఆ స్థలాన్ని వారికి అందజేస్తామని తెలిపారు. తరువాత పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు.





పంచాయతీ స్థలం అని బోర్డు పెట్టి స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించండి

- మంత్రి ఆదిమూలపు సురేష్



మంత్రిని సన్మానిస్తున్న పీడీ రవికుమార్

మార్కాపురం: ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని మున్సిపల్ శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్‌కు సూచించారు. పీడీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మార్కాపురంలో శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో సురేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు పీడీగా పనిచేసిన బాబూరావు మాతృశాఖకు వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో మెప్మా పీడీగా ఉన్న రవికుమార్‌ను నియమించారు.

ఆమెను చూస్తేనే ఆనందం...

ఆమె పేరు తాత ప్రవల్లిక. కొత్తపట్నం మండలంలోని గమళ్లపాలెం గ్రామంలో నాలుగేళ్లుగా వలంటీర్‌గా పని చేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ తన పరిధిలోని 50 కుటుంబాలకు అందే విధంగా చర్యలు తీసుకుంటోంది. ఒకటో తేదీ వచ్చిందంటే చాలు.. వేకువజామునే నిద్ర లేచి పింఛన్ లబ్ధిదారులందరి ఇళ్లకు వెళ్లి పెన్షన్ డబ్బు అందిస్తోంది. ప్రభుత్వ పథకాలకు సంబంధించి మహిళలకు ఏ పని కావాలన్నా చేసిపెడుతోంది. అవసరమైన అధికారులతో మాట్లాడి పనులు చేసిపెడుతోంది. కరోనా సమయంలో సైతం ధైర్యంగా బాధిత కుటుంబాలకు కిట్లు పంపిణీ చేసి మంచి పేరు తెచ్చుకుంది. ఎంతో మంది ప్రాణాలకు తన ప్రాణాన్ని అడ్డు వేసింది. ముఖ్యంగా ప్రభుత్వ పథకాల ఫలాలను ఇళ్లకే తెచ్చి అందిస్తూ ఉత్తమ వలంటీర్‌గా ప్రజల్లో పేరు తెచ్చుకుంది. దీంతో ఆమె ఎవరింటికైనా వస్తుందంటే ఆ ఇంటి ప్రజల కళ్లలో ఆనందం కనిపిస్తోంది.


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారికి ఒంగోలు వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రవల్లిక

మా వలంటీర్‌ని చూస్తే ఎంతో ధైర్యంగా ఉంటుంది


వలంటీర్‌తో మల్లాల యానాదమ్మ

మా వలంటీర్ మా ఇంటి కొస్తే నాకు ఎంతో ధైర్యం వస్తుంది. ఏదో ఒక సంక్షేమ పథకం మా ఇంటికి వచ్చినట్లే అనిపిస్తుంటుంది. ఏరోజు మా ఇంటికొచ్చినా మా కుటుంబానికి ఉపయోగపడే కబురు ఏదోటి చెబుతుంది. దాంతో మా కుటుంబ సమేతంగా సంతోషంగా ఉంటాం. ప్రతి నెలా ఇంటికొచ్చి పింఛన్ నగదు ఇస్తుంది. ఎటువంటి పనులున్నా ఆమె చేసి పెడుతోంది. నేను పక్షవాతంతో బాధపడుతుంటే ఆధార్ కార్డుకు ఫోన్ లింక్ చేయించడం, 104 వెహికల్ వచ్చినప్పుడు నన్ను తీసుకెళ్లి చూపించడం వంటి పనులు చేసిపెడుతుంది. ఒక్క రూపాయి తీసుకోకుండా నా బిడ్డలాగా నన్ను ఆదరిస్తోంది. ఇలాంటి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– మల్లాల యానాదమ్మ, గమళ్లపాలెం

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. పేద కుటుంబాల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నత స్థాయికి చేర్చాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారు. సర్కార్ స్కూళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెనుమార్పులకు నిదర్శనంగా నిలుస్తున్నారు. పదో తరగతి పరీక్షలతో పాటు పలు పోటీ పరీక్షల్లోనూ సత్తాచాటిన యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శభాష్ అనిపించుకుంటున్నారు.


యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

శభాష్ స్టూడెంట్స్..!

- సత్తాచాటిన యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు
- శ్రేష్ట పథకానికి ఐదుగురు ఎంపిక
- ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఆరుగురికి అర్హత
- ట్రిపుల్ ఐటీకి మరో ఐదుగురు ఎంపిక
- పదో తరగతిలో 16 మంది విద్యార్థులకు 500కుపైగా మార్కులు
- వరుస విజయాలతో దూసుకెళ్తున్న సర్కారు స్కూలు విద్యార్థులు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల సాకారం చేస్తున్న వైనం

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించింది. నాడు–నేడు కార్యక్రమం ద్వారా హైస్కూల్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేసింది. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అక్కడ చదివిన విద్యార్థులు వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో అత్యధికంగా 576 మార్కులు సాధించారు. 16 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకొచ్చారు. అంతేగాకుండా ట్రిపుల్ ఐటీకి ఐదుగురు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ క్యాడర్ కింద కేరళలో జరుగుతున్న ఆలిండియా ట్రెక్కింగ్ క్యాంప్‌నకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. మరో ఆరుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు అర్హత సాధించారు.

ప్రతిష్టాత్మకమైన 'శ్రేష్ట'కు ఐదుగురు విద్యార్థులు ఎంపిక...

తాజాగా ఎస్సీ విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ది స్కీం ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్స్ ఇన్ టార్గెటెడ్ ఏరియా' (శ్రేష్ట)కు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఐదుగురు యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 3 వేల మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది. 9వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశం కోసం ఈ అవకాశం కల్పిస్తారు. 9వ తరగతిలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు 11వ తరగతి వరకు, 11వ తరగతిలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు 12వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తారు. 12వ తరగతి తర్వాత పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనం పథకం, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ పథకం ద్వారా ఉన్నత విద్య అభ్యసించే అవకాశం లభిస్తుంది. అటువంటి శ్రేష్ట పథకాన్ని జిల్లాలోనే పూర్తిగా వెనకబడిన యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అందిపుచ్చుకున్నారు. జె.రేష్మ, డి.ప్రణయ్‌కుమార్, వై.ఏసుబాబు, చార్లెస్ వెస్లీ, చరణ్‌తేజ ఎంపికవగా, వీరిని సీబీఎస్ఈ అఫిలియేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చేర్పించి పూర్తిగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యనందిస్తారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.4.70 లక్షల ఖర్చును ప్రభుత్వమే భరాయిస్తుంది. ఇటువంటి పాఠశాలల్లో ఫీజులు ఎక్కువగా చెల్లించే శక్తి ఉన్న ధనవంతుల పిల్లలు మాత్రమే చదవగలుగుతారు. అటువంటి పాఠశాలలకు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు అర్హులు కావడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎం.వి.భాస్కర్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


జె.రేష్మ


డి.ప్రణయ్‌కుమార్


వై.ఏసుబాబు


చార్లెస్ వెస్లీ


చరణ్‌తేజ

పేద పిల్లల్లో ప్రతిభను వెలికితీయడమే జగనన్న లక్ష్యం



రాష్ట్రంలో ఉన్న పేద పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యం. అధికారంలోకి వచ్చిన వెంటనే నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారు. విద్యార్థులకు కావాల్సిన వసతులన్నీ సమకూర్చడంతో పాటు ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు పోటీగా పుస్తకాలు, యూనిఫాం, మంచి పౌష్టికాహారం అందించడంతో పాటు పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ కారణాలతోనే విద్యార్థులు చదువులో సత్తా చాటేందుకు పోటీ పడుతున్నారు.

– డాక్టర్ ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సాహం



శ్రేష్ట ప్రవేశం కోసం విద్యార్థులకు ప్రత్యేకంగా కోచింగ్ ఏమీ ఇవ్వడం లేదు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లో ప్రతిభ సాధించే విధంగా విద్యార్థులతో సాధన చేయిస్తున్నాను. విద్యార్థుల్లో ప్రతిభ ఉందని గమనించి వారిని శ్రేష్ట ప్రవేశ పరీక్షలకు పంపాము. హెచ్ఎం బి.రమాదేవి, తోటి ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను.

– ఎంవీ భాస్కర్, ఉపాధ్యాయుడు

విద్యుత్ షాక్‌తో ఎనర్జీ అసిస్టెంట్ మృతి


పోలీస్‌స్టేషన్ వద్ద చంటిబిడ్డతో మృతుని భార్య రమాదేవి


మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ వద్ద రోదిస్తున్న మృతుని భార్య రమాదేవి

- అధికారుల నిర్లక్ష్యమే కారణమని భార్య, బంధువుల ఆరోపణ
- న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్, వైద్యశాల వద్ద నిరసన
- పట్టించుకోని అధికారులు
- మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీలను కలిసిన బాధితులు

పొదిలి: విద్యుత్ లైన్ పనులు చేస్తూ షాక్‌కు గురై ఎనర్జీ అసిస్టెంట్ మృతిచెందిన సంఘటన పొదిలి నగర పంచాయతీ పరిధిలోని కంభాలపాడు గ్రామ పొలాల్లో శనివారం చోటుచేసుకుంది. కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన అలవల నారాయణస్వామి (30) పొదిలి మండలం కొండాయపాలెం సచివాలయంలో పనిచేస్తూ కంభాలపాడులో ఎనర్జీ అసిస్టెంట్ లేకపోవడంతో ఆ బాధ్యతలు కూడా చూస్తున్నాడు. కంభాలపాడు నుంచి ఓబులక్కపల్లి వెళ్లే దారిలో పొలాలకు సంబంధించిన విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేసేందుకు స్తంభం ఎక్కాడు. విద్యుత్ షాక్ తగిలి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నారాయణస్వామికి పొదిలి మండలంలోని సలకనూతల గ్రామానికి చెందిన రమాదేవితో వివాహం జరిగింది. ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. సచివాలయంలో ఉద్యోగం కూడా పొందడంతో కుటుంబమంతా సంతోషంగా ఉంది. ఆ ఆనందం నుంచి బయటపడకముందే నారాయణస్వామి మృత్యువాతపడటంతో భార్య, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఏడాది కొడుకును చంకనెత్తుకుని భార్య రమాదేవి రోదించిన తీరు కంటతడి పెట్టించింది.


సంఘటన స్థలంలో నారాయణస్వామి మృతదేహం


నారాయణస్వామి (ఫైల్)

అధికారుల తీరుపై ఆరోపణలు...

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిండు ప్రాణం బలైందని నారాయణస్వామి భార్య, బంధువులు ఆరోపించారు. ఏఈ ఒత్తిడి మూలంగానే పోల్ ఎక్కి ప్రాణాలు పోగొట్టుకున్నాడని ఆరోపణలు చేశారు. ఎల్‌సీ తీసుకునే విషయంలోనే తేడా జరిగి ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతుండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన వెంటనే కనీసం ఏఈ స్థాయి అధికారి కూడా సంఘటన స్థలానికి రాకపోవడం, ప్రమాదం గురించి తెలుసుకోకపోవడం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనంగా ఉందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్, వైద్యశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు.

మంత్రి, ఎమ్మెల్యేలను కలిసి ఫిర్యాదు...

మృతుడు నారాయణస్వామి భార్య, బంధువులు, సచివాలయాల్లో పనిచేసే ఎనర్జీ అసిస్టెంట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని కలిసి విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు తమతో జాబ్‌చార్ట్ కాకుండా ఇతర డ్యూటీలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. దానివలనే నారాయణస్వామి మృతి చెందాడని ఆందోళన వ్యక్తం చేశారు. తాము జాబ్‌చార్ట్ ప్రకారమే డ్యూటీలు చేస్తామని, ఒత్తిడి చేయకుండా విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలివ్వాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఎస్ఈపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి సురేష్...

మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని కలిసిన మృతుని భార్య రమాదేవి న్యాయం చేయాలని వేడుకోగా, స్పందించిన మంత్రి సురేష్.. వెంటనే విద్యుత్‌శాఖ ఎస్ఈకి ఫోన్ చేశారు. జరిగిన సంఘటనపై ఎస్ఈని మంత్రి ప్రశ్నించగా, ఎల్‌సీ తీసుకునే సమయంలో జరిగిన తేడాతోనే ప్రమాదం జరిగిందని సమాధానమిచ్చారు. ఎస్ఈ చెప్పిన సమాధానం విన్న మంత్రి సురేష్.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌సీలో తేడాతో చనిపోయాడని ఒకమాట చెబితే సరిపోతుందా అంటూ ఎస్ఈపై మండిపడ్డారు. ఒక ఉద్యోగి చనిపోతే కనీసం ఆ శాఖ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లరా అంటూ నిలదీశారు. ఏ సబ్ స్టేషన్ పరిధిలో జరిగింది, ప్రమాదం ఎలా జరిగింది, లాగ్ బుక్ తనిఖీ చేశారా..? అవన్నీ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఏం వస్తాయో చూసి వెంటనే అందేలా చూడాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ సిబ్బంది

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు గ్రామంలో శనివారం బాల్య వివాహాన్ని అడ్డుకున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలకుమారి తెలిపారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి పూర్తి చేసిన గ్రామానికి చెందిన బాలికకు తండ్రి లేకపోవడంతో తల్లి కోటేశ్వరమ్మ 17 ఏళ్లకే వివాహం చేస్తోంది. స్థానిక మహిళా సంరక్షణ కార్యదర్శి ద్వారా సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సిబ్బంది సూపర్‌వైజర్ కమలకుమారికి తెలిపారు. ఆమె స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాలికతో పాటు ఇరు కుటుంబాలను పిలిపించి ఎస్సై ఏవీ కృష్ణయ్య, ఎంపీడీవో కుసుమకుమారి, సూపర్‌వైజర్ కమలకుమారి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలికను మళ్లీ అదే పాఠశాలలో పదో తరగతిలో చేర్పించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: మాదకద్రవ్యాల విక్రయం, నాటు సారా తయారీ, అక్రమంగా మద్యం విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మలికాగర్గ్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో శనివారం సమీక్షించారు. ఇటువంటి ఘటనలపై సమాచార సేకరణ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో నమోదైన కేసులు, వాటి స్థితి, నిందితుల అరెస్టులు, తదితరాలకు సంబంధించి అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. దర్యాప్తు త్వరగా పూర్తిచేయడంతో పాటు నిందితులకు శిక్షలు పడేలా చర్యలు ఉండాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేగవంతంగా డిస్పోజల్ చేయాలన్నారు. గంజాయిని జిల్లాకు తీసుకొస్తున్నవారు, దానిని జిల్లాలో విక్రయిస్తున్న వారిపై నిఘా పెంచాలన్నారు. యువతకు, కాలేజీ విద్యార్థులకు గంజాయి వంటి డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా చైతన్యం కల్పించడంతో పాటు మార్పు తీసుకొచ్చేలా చర్యలు ఉండాలన్నారు. నాటుసారా జీవనోపాధిగా ఉండేవారికి ప్రత్యామ్నాయ ఆర్థిక మార్గాల ద్వారా పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. అక్రమ మద్యం సరఫరా చేసేవారితో పాటు విక్రయాలపై కూడా నిఘా పెంచాలన్నారు. వాటితోపాటు జూదం, ఇసుక అక్రమ రవాణా వంటి వాటిని కూడా నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఎస్ఈబీ ఈఎస్ ఎ.ఆవులయ్య, ఏఈఎస్‌లు ఎం.సుధీర్‌బాబు, ఏ.శ్రీనివాసులు నాయుడు, ట్రైనీ డీఎస్పీ సుబ్రహ్మణ్యం, సీఐ వంశీధర్, ఎస్ఈబీ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


ఎస్ఈబీ అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఎంపీడీవో అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ

తాళ్లూరు (ముండ్లమూరు): తాళ్లూరు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవో వై.శ్రీనివాసరావు అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి శనివారం ఒంగోలులో కలెక్టర్‌ను కలిసి ఎంపీడీవో అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా పలు అక్రమాల వివరాలను కలెక్టర్‌కు వారు అందజేశారు. ప్రజాప్రతినిధులనే గౌరవం కూడా లేకుండా తమను అనేక రకాలుగా ఎంపీడీవో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికే చాలా మంది ఆయనకు లంచాలు ఇచ్చారంటూ ఆ వివరాలను కూడా కలెక్టర్‌కు అందజేశారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు, ప్రతి పనికీ లంచం అడుగుతూ ప్రజాప్రతినిధులు పనులు చేయకుండా ఎంపీడీవో అడ్డుకుంటున్నారని తెలిపారు. లంచం ఇస్తేనే పని చేయాలనే ధోరణిలో ఆయన ఉన్నారన్నారు. ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి తాను చెప్పినట్లు చేయకుంటే మెమోలు జారీ చేస్తానని కింది స్థాయిలో పనిచేసే సిబ్బందిని సైతం భయపెడుతున్నాడని తెలిపారు. మద్దిపాడులో ఉంటూ తాళ్లూరుకు సక్రమంగా రాకుండానే అన్ని అక్రమాలను నడిపిస్తున్నాడని ఆరోపించారు. ఎంపీడీవో అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని ప్రజాప్రతినిధులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.


ఎంపీడీవో అక్రమాలను కలెక్టర్‌కు వివరిస్తున్న తాళ్లూరు ఎంపీపీ, జెడ్పీటీసీ

రేపు కొండపిలో కలెక్టర్ స్పందన

ఒంగోలు అర్బన్: ప్రతి సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ కొండపి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. కొండపిలోని సాయిసీతారామ ఫంక్షన్ హాలులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన నిర్వహించనున్నారు. అనంతరం మూడు గంటలకు నియోజకవర్గ సమావేశం జరుగుతుందన్నారు. స్పందన కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం మొత్తం హాజరవుతారని, నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. శనివారం నో యాక్సిడెంట్ డే సందర్భంగా ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా నో యాక్సిడెంట్ డే నిర్వహణతో 2023 మొదటి ఆరు నెలల కాలంలో 16 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించడమే కారణమన్నారు. జిల్లావ్యాప్తంగా 37 బ్లాక్ స్పాట్లు, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలను గుర్తించి బ్యారికేడింగ్, ప్రమాద సూచిక బోర్డులు, స్టాపర్స్, సిగ్నల్ లైట్లు, బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలంతా రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.